జమ్మలమడుగులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీవో సాయిశ్రీ తదితరులు



1న సీఎం చంద్రబాబు పర్యటన

● పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, కూటమి నేతలు

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 1వ తేదీ జమ్మలమడుగులో పర్యటించనున్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు సీఎం పర్యటన ఏర్పాట్లకోసం పరిశీలించారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని క్యాంబెల్ వైద్యశాలకు సంబంధించిన ప్రాంగణంలో ఖాళీ మైదానాన్ని, అంబవరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఖాళీ ప్రదేశాన్ని, జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా రెండు ఖాళీ మైదానాలను పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువుగా ఉన్న స్థలం ఎంపికపై అక్కడి అనుకూలతలు, భద్రత తదితర అంశాలపై ఎస్పీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ చర్చించారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయండి

జమ్మలమడుగులో ఆగస్టు 1న పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన కోసం పక్కా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో సీఎం పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పేదల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఆగస్టు 1వ తేదీన జమ్మలమడుగుకు రానున్నారన్నారు. అందులో భాగంగా పెన్షన్ లబ్ధిదారుల కుటుంబాల ఇళ్లవద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్‌దారుల కుటుంబ ఆర్థిక స్థితిగతులపై అడుగుతారన్నారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారన్నారు. కాగా ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జిల్లా అధికారులు ధర్మారావు, మెప్మా డీఆర్‌డీఏ డ్వామా పీడీలు, కిరణ్‌కుమార్, రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, డీఎంహెచ్‌వో నాగరాజు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారి ధర్మారావు, తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ నేతలు రమణారెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీ-4 పక్కాగా అమలు చేయాలి : జేసీ

కడప కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 పక్కాగా అమలు జరగాలని, ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల దత్తత పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జేసీతో పాటు అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించడానికి పీ-4 అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అన్ని జిల్లాల్లో ఈ పథకం 100 శాతం అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాలో పీ-4 కార్యక్రమం పక్కాగా అమలు జరగాలన్నారు. అలాగే బంగారు కుటుంబాల దత్తత మార్గదర్శుల ఎంపిక ఆగస్టు15 నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


2 వరకు నిరక్షరాస్యుల సర్వే : జేసీ

నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో భాగంగా ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో నిరక్షరాస్యుల సర్వే చేపట్టాలని అధికారులను జేసీ అదితిసింగ్ ఆదేశించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ చాంబరులో ఉల్లాస్ పథకంపై జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ దేశంలో 2029 నాటికి 100 శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. 15-59 ఏళ్ల మధ్య వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకోని పెద్దలను గుర్తించి వారికి వలం టీర్ ద్వారా విద్య అందించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 2 వతేదీ వరకు జిల్లాలో నిరక్ష రాస్యుల సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఎంవీ సుబ్బారెడ్డి, ఐసీడీ ఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

● నిషేధం పెట్టినా లెక్కచేయని ఇసుకాసురులు
● ట్రాక్టర్లలో బయటి ప్రాంతాలకు తరలింపు

మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద బోర్లలో నీటిమట్టం కోసం వేసిన ఇసుక కట్టలను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరులో ఇసుక దందా ఆగడం లేదు. రెవెన్యూ అధికారులు పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని ప్రకటించినా.. ఇక్కడ తవ్వకాలపై నిషేధం ఉందని చెప్పినా ఇసుకాసురులు ఖాతరు చేయడం లేదు. రోజూ వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తవ్వి బయటి ప్రాంతాలకు తరలించి రూ.లక్షల్లో ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. రెవెన్యూలో, పోలీసు శాఖలో కొందరు కిందిస్థాయి అధికారులకు, సిబ్బందికి మామూళ్లు ఇచ్చి యథేచ్ఛగా ఇసుక దందా నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



క్యూ కట్టిన ఇసుక ట్రాక్టర్లు



రైల్వే బ్రిడ్జి కింద జరుగుతున్న ఇసుక తవ్వకాలు

ప్రొద్దుటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చింది. అనుమతి ఉన్న రీచ్‌లల్లో తప్ప ఇలా నదుల్లో ఎక్కడపడితే అక్కడ ఇసుక తవ్వకాలు జరిపి వైసీపీ ప్రభుత్వంలో లాగా దోపిడీ సాగించాలని కాదు. ప్రొద్దుటూరు పట్టణంలో లక్షలాది మందికి తాగునీటిని అందించే మున్సిపల్ హెడ్‌వాటర్ వర్క్స్‌కు సంబంధించిన తాగునీటి బోర్లు పెన్నానదిలో ఉన్నాయి. అక్కడ మైలవరం నుంచి విడుదల అయ్యే నీరు నదిలో నిల్వఉంచడం కోసం అడ్డంగా గతంలో మున్సిపల్ అధికారులు ఇసుక కట్టలు కట్టారు. నేడు ఆ ఇసుక కట్టలన్నింటిని అక్రమంగా తవ్వేసి దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక దోపిడీ గురించి పత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోవడం లేదు. అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక దోపిడీ సాగుతున్నా అడ్డుకోవడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఈ ఇసుక దోపిడీలో టీడీపీ వారు ఉన్నారనే ప్రచారం సాగుతోంది.

ప్రొద్దుటూరులో లక్షలాదిమంది ప్రజలకు తాగునీటిని అందించే మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఇసుకను తరలించకపోతున్నా ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదు. నదిలో ఇసుక వనరు కనుమరుగైతే భవిష్యత్తులో మైలవరం నుంచి నీళ్లు విడుదల చేసినా ఇక్కడ నిల్వ ఉండే అవకాశం లేదు.

అనుమతులు లేకున్నా..

ప్రొద్దుటూరు మండలంలోనిచౌడూరు, కల్లూరు ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. కానీ ఇసుకాసురులు ప్రొద్దుటూరు పట్టణం అనుకుని ఉన్న అయ్యప్పదేవళం వెనుక నుంచి ముక్తియార్ ఆయిల్ మిల్లు దగ్గర, ఆర్టీపీపీ రోడ్డు, గంగమ్మదేవళం దగ్గర, మున్సిపల్ హెడ్‌వాటర్ వర్క్సు రైల్వే బ్రిడ్జి దగ్గర అక్రమంగా పెన్నానదిలో తవ్వి నదిని గుల్ల చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు తమకు పోలీసులు సహకరించడం లేదని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ పోలీసు మున్సిపల్ మైనింగ్ అధికారులు సంయుక్తంగా ఈ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోకపోతే ప్రొద్దుటూరు వద్ద పెన్నానది స్వరూపాన్ని కోల్పోక తప్పదు.

నకిలీ పట్టాల ముఠా అరెస్ట్

● 13 మందిపై కేసు నమోదు
● 10 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
● నకిలీ పత్రాలు, అనుబంధ ఫారాలు, పాసుబుక్కులు స్వాధీనం
● డీఎస్పీ రాజేంద్రప్రసాద్



నకిలీపట్టాల తయారీ ముఠాను అరెస్ట్‌చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బద్వేలుటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బద్వేలులో నకిలీపట్టాల కేసుపై డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో విచారణ చేపట్టి 13మందిపై కేసు నమోదు చేయగా, శుక్రవారం 10మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీపట్టాలు, అనుబంధ ఫారాలు, పాసుబుక్కులు, రెవెన్యూ అధికారుల సీళ్లు, రబ్బరుస్టాంపు మిషన్, ప్రింటర్లను స్వాధీనం చేసుకుని నిందితులను బద్వేలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గోపవరం మండలం నుంచి ఒక పట్టాపై ఫిర్యాదు రావడంతో దానిని తహశీల్దార్‌కు పంపగా, వారు పరిశీలించి నకిలీది తేల్చారన్నారు. ఈ పట్టాకు సంబంధించి దాసరి రత్నమ్మ అనే మహిళను విచారించడంతో నకిలీపట్టాలు తయారు చేసిన పిల్లి భాస్కర్, రవిశంకర్, బాబూరావు, చిన్నసుబ్బయ్య పేర్లు వెలుగులోకి వచ్చాయన్నారు. వీరిని విచారించడంతో రామాంజుల ఓబులేసు అలియాస్ కుమార్ అనే వీఆర్వో ద్వారా నకిలీ పట్టాలు తయారుచేసి ఇస్తున్నారనే విషయం తేలిందన్నారు. వీరు కడప నగరానికి చెందిన బాబూ ప్రింటర్స్ యజమాని షేక్ బాబ్‌జాన్ వద్ద సీళ్లు, రబ్బరు స్టాంపులు తయారు చేయించుకొని అందరూ ఒక ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు, అనుబంధ పత్రాలు, పాస్‌బుక్కులను తయారుచేసి విక్రయదారులకు ఇచ్చేవారన్నారు. ఈ నేపథ్యంలో ప్రసాద్, జయపాల్ ఇద్దరూ నకిలీ పట్టాలు తెచ్చి రత్నమ్మకు ఇచ్చారన్నారు. ఆమె వాటిని ఐదారుగురికి విక్రయించిందని దీంతో వారంతా గొడవ పడి ఆ సమస్య పోలీస్‌స్టేషన్‌కు చేరగా, దీని ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

అరెస్టు అయింది వీరే..

నకిలీ పట్టాల తయారీ ముఠా కేసులో 10 మందిని అరెస్టు చేశామన్నారు.. మార్తోమ నగర్‌కు చెందిన దాసరి రత్నమ్మ, పొట్టి ప్రసాద్, పొట్టిపాటి జయపాల్, సుమిత్రానగర్ వాసి రామాంజుల ఓబులేసు అలియాస్ కుమార్, బయనపల్లెకు చెందిన పిల్లి భాస్కర్, బేతాయపల్లె వాసి మన్యం బాబూరావు, సుమిత్రనగర్‌కు చెందిన బత్తిన రవిశంకర్, గూడెం గ్రామానికి చెందిన కాడి చిన్నసుబ్బయ్య, కడపలోని బాబూ ప్రింటర్స్ యజమాని షేక్‌బాబ్‌జాన్, కాశినాయన మండలం రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసులను అరెస్ట్ చేశామని డీఎస్పీ అన్నారు. వీరితోపాటు మరికొంత మంది ఉన్నారని విచారణ చేపట్టి వీరిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

వీటిని స్వాధీనం చేసుకున్నారు

నకిలీ పట్టాలు తయారుచేసే ముఠా నుంచి రెవెన్యూ కార్యాలయాల సీళ్లు 46, వ్యవసాయ డి.నమూనా పత్రాలు 96, డీకేటీ పట్టాలు 280, అనుబంధ పత్రాలు 28, పట్టాదారు పాసుబుక్కులు 70, పొసెషన్ సర్టిఫికెట్లు 35, వ్యవసాయ భూమి అప్పగింత పట్టాలు 22, వైట్‌నర్ 1, ఇంక్‌పాడ్ 5, గ్రీన్ ఇంకు పెన్నులు 4, స్టాప్‌నర్ 1, గమ్‌బాటిళ్లు 2, ప్రింటర్ 1, రబ్బరుస్టాంపు తయారు చేసే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సీఐ రాజగోపాల్, ఎస్‌ఐలు సత్యనారాయణ, జయరామిరెడ్డి వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ పట్టాలు, సీళ్లు, పాసు బుక్కులు

కుందూలో భారీగా వరదనీరు



రాజుపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కుందూ నదిలో భారీగా వరద నీరు పారుతోంది. ఎగువప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు జిల్లా సరిహద్దులోని రాజోలు ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 13,300 క్యూసెక్కులు వస్తోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ నీరు కుందూనది ద్వారా నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టుకు చేరుతుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా కేసీ ప్రధాన కాల్వకు 300 క్యూసెక్కులు, చాపాడు కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రవహిస్తున్నట్లు తెలిపారు. కుందూలో భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో కుందూకు ఇరుపక్కలా పంటలున్న ఉన్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలు చేయండి

● సొంత వ్యాపారంలా చీనీ వ్యాపారం సాగిస్తే సహించేది లేదు
● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పులివెందుల, జూలై 25(ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలు చేయాలని, చీనీ వ్యాపారులు సొంత వ్యాపారంలా సాగిస్తే సహించేది లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల మార్కెట్ యార్డులో కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. 21వ తేదీ సోమవారం ఆంధ్రజ్యోతిలో 'పతనమైన చీనీ ధరలు' అనే శీర్షికతో కథనం వెలువడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లింది. దీనితో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పరిశీలించి పలు సలహాలు, సూచనలు, హెచ్చరికలు చేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో పులివెందుల చీనీ మార్కెట్‌ను కలెక్టర్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులను మరింత మెరుగైన ధరలకు విక్రయించేందుకు ఈ-నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్) వ్యవస్థలో అవకాశం ఉంటుందన్నారు. ఈనెలలోనే ఈ-నామ్ వ్యవస్థలోకి పులివెందుల మార్కెట్‌ను తీసుకొస్తామన్నారు. చీనీ పంటకు సరైన ధర అందేలా సంబంధిత శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. పులివెందుల మార్కెట్‌ను ఇప్పటి వరకు గ్రేడింగ్ చేయకపోవడం దారుణమన్నారు. ఇతర రాష్ట్రాల్లో చీనీపంట ధరను సందర్శించకపోవడం, కంప్యూటరైజ్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్ ఏజెంట్లు నిబంధనలకు లోబడి పనిచేయాలే కానీ సొంత వ్యాపారం అనుకొని చేస్తే సహించేది లేదన్నారు. మార్కెట్‌కు సంబంధించిన సెక్రటరీ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని లేదంటే జీతం కట్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, పపులివెందుల ఆర్డీవో చిన్నయ్య, మార్కెటింగ్ శాఖ డీడీ లావణ్య, ఏడీ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా కడప

● ప్రకటించిన జేసీ అదితి సింగ్



కడప కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రకటించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బీసీ హాలులో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0పై జేసీ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నాటుసారాను నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0 ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేశారన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ పూర్తిగా నిర్మూలించామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధికారి రవికుమార్, డీఈవో షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

ఎంఈఓలకూ ముఖహాజరు


● పనితీరు మెరుగుకు ప్రభుత్వం చర్యలు
● ప్రతిరోజూ పాఠశాలలను తనిఖీ చేయాల్సిందే


మండల విద్యాశాఖ అధికారులతో పాటు ఎమ్మార్సీలో పనిచేస్తున్న సిబ్బంది ఇక నుంచి ఉదయం ఆన్‌లైన్‌లో ఫేషియల్ అటెండెన్స్ (ముఖ హాజరు) తప్పనిసరిగా వేయాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. ఎంఈఓలు రోజూ ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల పర్యవేక్షణ, విద్యాపథకాల అమలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు ప్రమాణాలను పర్యవేక్షించే బాధ్యత ఎంఈఓలదే.

కడప ఎడ్యుకేషన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ స్థాయిలో విద్య ప్రమాణాలు మెరుగుపడేందుకు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు సీఆర్పీ వ్యవస్థను పదేళ్ల కిందట ఏర్పాటు చేశారు. వైసీపీ పాలనలో ప్రతి మండలానికి అదనంగా ఎంఈఓ-2ను నియమించారు. ఈ లెక్కన జిల్లాలో 36 మండలాలు ఉండగా 26 మండలాలకు ఎంఈఓ-1 విధులు నిర్వహిస్తున్నారు. మిగతా 10 మండలాల్లో ఇన్‌చార్జిలు పనిచేస్తున్నారు. ఎంఈఓ-2లు అన్ని మండలాలకు ఉన్నారు. అయినా పాఠశాలల పర్యవేక్షణ గాడిన పడలేదు. పైగా ఇద్దరు ఎంఈఓలు ఉండడంతో జిల్లాలో పలు మండలాల్లో వారి మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. ఇంకోవైపు చాలా మంది ఎంఈఓలు స్థానికంగా ఉండడం లేదు. జిల్లా, డివిజన్ కేంద్రంలోనే నివాసం ఉంటున్నారు. దీనితో పనివేళలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు జిల్లా కేంద్రంలో ఉంటూ ఇక్కడినుంచే ఏదో ఒక పనికారణం చూపి ముఖహాజరు నమోదు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంఈఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ముఖహాజరుకు ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం ఎమ్మార్సీలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఆపరేటర్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది కూడా ఉదయం 9గంటలకు ఫేషియల్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది.

హాజరు, తనిఖీలపై రోజూ నివేదిక

ఎంఈఓలు తోచిన కారణాలు చెప్పి తప్పించుకోవడానికి అవకాశం లేకుండా కమిషనర్ చర్యలు చేపట్టారు. టీచర్ల మాదిరిగానే ఉదయం 9.30 గంటలకు ఎంతమంది ఎంఈఓలు హాజరు వేసింది జిల్లా విద్యాశాఖ ప్రతిరోజు కమిషనరేట్‌కు నివేదిక పంపించాలి. ప్రతిరోజు ఒక పాఠశాలను ఎంఈఓ తప్పనిసరిగా తనిఖీ చేయాలి. ఆ పాఠశాల నుంచి ఫేషియల్ అటెండెన్స్ వేయాలి. గతంలో కొందరు ఎంఈఓలు మండల కేంద్రాలు లేదా డివిజన్ కేంద్రం నుంచి ఎప్పుడో బయలుదేరి దగ్గర ఉన్న పాఠశాలలకు వెళ్లి తూతూమంత్రంగా తనిఖీలు చేసి హాజరైనట్లు నమోదు చేసుకునేవారు. ఇప్పుడు అలా కాకుండా ఎంఈఓలకు జీపీఎస్ విధానం అమలు చేస్తున్నారు. ఎమ్మార్సీలకు వెళ్లినా, పాఠశాలలకు వెళ్లినా అక్కడి లోకేషన్ చూపిస్తుంది. తాజా ఉత్తర్వులతో కొంతమంది ఎంఈఓలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.





ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం..

ఎంఈఓలు, ఎమ్మార్సీ సిబ్బంది కూడా ప్రతిరోజు ఉదయం 9గంటలకు ఎమ్మార్సీలకు వెళ్లి ఫేషియల్ అటెండెన్స్ వేయాలి. ఎంఈఓలు ప్రతిరోజు ఒక పాఠశాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. ఆ పాఠశాల నుంచే ఫేషియల్ అటెండెన్స్ వేయాలి. గత ప్రభుత్వంలో ఫేషియల్ అటెండెన్స్ ఉన్నప్పటికి ఆచరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు, విద్యాప్రమాణాలు పెంచేందుకు కొన్ని సంస్కరణలు అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరు వారి విధులు సక్రమంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం.

- షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

బంగారు కుటుంబాలను గుర్తించాలి



'పీ-4'పై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంతో బంగారు కుటుంబాలను గుర్తించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలిసి ఇతర అధికారులు సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జీరో పావర్టీ కింద ప్రభుత్వం చేపట్టిన 'పీ-4' విధానంలో గ్రామాలు, పట్టణాల్లో బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. ఆర్థిక స్థోమత వున్న వారిని గుర్తించి వారి సహాయంతో నిరుపేదలను వారికి తోచిన విధంగా ఆర్థికంగా ఆదుకునేలా సహకారం కోరాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సాధికారత కోసం సీఎం చంద్రబాబు 'పీ4' ప్రారంభించారని, అధికారులు కూడా బాధ్యతగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓలు తాజ్‌మస్రూర్, రమేశ్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలపై కేసు నమోదు

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా మరికొందరు వైసీపీ నేతలపై పీలేరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసు యాక్టు 30 అమలులో ఉన్నప్పుడు పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ బుధవారం పీలేరులోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. దీంతో పోలీసులు అందులో పాల్గొన్న చింతల రామచంద్రారెడ్డి, పీలేరు మండల వైసీపీ అధ్యక్షుడు దండు జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కంభం సతీశ్ రెడ్డి, జడ్పీటీసీ రత్నశేఖరరెడ్డి, సర్పంచ్ హబీబ్ బాషా, నాయకులు ఉదయ, షాకీర్, మునీర్, గాయం భాస్కరరెడ్డితో పాటు మరికొందరిపై కేసు (నెం.181/2025) నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు అతివేగంగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం సూరప్పగారిపల్లె వద్ద జరిగింది. రామాపురం మండలం గువ్వలచెరువుకు చెందిన సలీమ్, జాకీర్ ఆటోలో పాలఖవ్వ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా వీరు ఆటోలో గుర్రంకొండకు వస్తుండగా మండలంలోని సూరప్పగారిపల్లె వద్ద మదనపల్లె నుంచి రాయచోటికి వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సలీమ్, జాకీర్‌కు గాయాలయ్యాయి. బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు.

'భూములు దురాక్రమణ కానివ్వద్దు'



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె, జూలై 25(ఆంధ్ర జ్యోతి): జుంజురపెంట పంచాయతీ నేరేడు కొండపై వెలసిన నేరేడు కొండ్రాయ స్వామి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా కాపాడాలని మూడు గ్రామాల ప్రజలు తహసీల్దారు శ్రీనివాసులును కోరారు. శుక్రవారం జుంజురపెంట, ఆర్ఎన్ తండా, కొట్టాల గ్రామాల ప్రజలు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు బండారి నాగరాజ ఆధ్వర్యంలో తహసీల్దారును కలిసి వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ దాదాపు 700 ఏళ్ల కిందటి నుంచి పూజలందుకుంటున్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి తంబళ్లపల్లె మండలంలోని జుంజురపెంట, ములకలచెరువు మండలంలోని కాలువపల్లె పంచాయతీల్లో మాన్యం భూములు ఉన్నాయన్నారు. బురుజుపల్లెకు చెందిన కొందరు నేరేడు కొండ్రాయస్వామి ఆలయం పేరుతో దాతల నుంచి డబ్బు వసూలు చేశారని, ఇప్పుడు మాన్యం భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జుంజురపెంట నేరేడు కొండపై ఉన్న నేరేడు కొండ్రాయస్వామి ఆలయానికి, బురుజు పల్లెలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి గుడికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అధికారులు స్పందించి ఆలయ భూములు దురాక్రమణ కాకుండా చూడాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, నేరేడు కొండయ్యస్వామి ఇలకాపులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రామాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. స్థానికుల, పోలీసుల వివరాల మేరకు... పుంగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కడప నుంచి పుంగనూరుకు వెళుతుండగా మార్గమధ్యలో టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి దుర్మరణం చెందాడు. కాగా బస్సు డ్రైవర్ రాయచోటి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదుపులో ఉన్నట్లు సమాచారం.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భోజనం పెట్టేదెలా..?

- వసతి గృహ అధికారులపై మెనూ భారం
- మెనూలో సవరణలకు తావులేని జీవో 8
- మానసిక ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు
- వైసీపీ అనాలోచిత చర్యలు.. బీసీ వసతిగృహాలకు శాపాలు



సంబేపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయలేక అధికారులు సతమతమవుతున్నారు. గతంలో ధరలకు అనుగుణంగా మెనూ చేర్పులు, మార్పులకు వీలుగా ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో విడుదల చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2022లో ప్రభుత్వం క్యాబినెట్‌లో ధరలు లేని మెనూతో జీవో నెంబర్ 8 అమలు చేసింది. దీంతో వసతి గృహ అధికారులపై భారం పడుతోంది.

మార్కెట్‌లో ప్రతి వస్తువుకు ధర ఉంది. ధర లేకుండా మెనూ పెట్టడం ఒక్క వైసీపీ ప్రభుత్వానికే చెల్లింది. బియ్యం, కందిబేడలు, ఆయిల్, చింత పండు, కోడిగుడ్డు, అరటిపండు, గోధుమపిండితో పాటు వివిధ రకాలతో మెనూ కోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఒక్క రోజుకు రూ.46 కేటాయించింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకార ఒక్కో విద్యార్థికి సరాసరి రోజుకు రూ.59 ఖర్చవుతోంది. దీంతో ఒక్క విద్యార్థిపై ఒక రోజుకు రూ.13 అదనపు భారం పడుతున్నట్లు వసతి గృహ అధికారులు (హెచ్‌డబ్ల్యువో) లబోదిబోమంటున్నారు. ధరలను బట్టి మెనూ మార్చే అధికారం ఆయా జిల్లాల కలెక్టర్లకు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం క్యాబినెట్‌లో జీవో నెంబర్ 8 పెట్టడంతో కలెక్టర్లకు కూడా మెనూ మార్చే అధికారం లేదు. దీంతో వైసీపీ అనాలోచిత చర్య వసతి గృహ అధికారులకు శాపంగా మారిందని చెప్పవచ్చు.

ఎఫ్ఆర్ఎస్‌లో సాంకేతిక లోపంతో..

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యారుల హాజరు కోసం ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) పద్ధతిని ప్రవేశపెట్టింది. విద్యార్థుల హాజరు ముఖం ఆధారంగా నమోదు చేస్తారు. అయితే ఎఫ్ఆర్ఎస్ సిస్టంలో సాంకేతిక లోపాలతో ఒక్కోరోజు కొంతమంది విద్యార్థుల హాజరు నమోదు కావడంలేదు. దీంతో హెచ్‌డబ్ల్యూవోలపై అదనపు భారం పడుతుంది. కేవలం బీసీ వసతి గృహాల్లో మాత్రమే ఈ విధానం ప్రవేశపెట్టారు. వసతి గృహ అధికారులు సెలవులో ఉన్నప్పుడు ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం హాజరును నమోదు చేసేందుకు అవకాశం లేదు. ట్యాబులు, సెల్‌ఫోన్లను ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కూడా నష్టపోతున్నట్లు చెబుతున్నారు.



బీసీ వసతి గృహ విద్యార్థులకు రోజు వారీ మెనూ

స్కావెంజర్స్ నియామకాల్లేవు

సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతను పాటించాలని ఒక పక్క చెబుతున్నా ఆ దిశగా నిబంధనలు పాటించడం లేదని చెప్పవచ్చు. బాత్‌రూంలు, మరుగుదొడ్ల శుభ్రతకు ఫినాయిల్ ఇవ్వరు. యాసిడ్ ఉండదు. వీటిని శుభ్రపరిచేందుకు స్కావెంజర్స్ నియామకం జరపడం లేదు. దీంతో హాస్టళ్ల పరిశుభ్రత కూడా వసతి గృహ అధికారులపై అదనపు భారం పడుతోందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీ హాస్టళ్ల పరిశుభ్రతకు స్కావెంజర్స్ నియామకం చేపట్టాలని కోరుతున్నారు.

ఒత్తిడిలో హెచ్‌డబ్ల్యూవోలు

సంక్షేమ వసతి గృహాల నిర్వహణ అమలులో హెచ్‌డబ్ల్యూవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పవచ్చు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలంటే అదనపు భారం తప్పడం లేదు. ఇక వసతి గృహ నిర్వహణ బాధ్యతలు భారంగా మారుతున్నాయి. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఆందోళనతో చనిపోతున్నారు. వారం క్రితం బాపట్ల జిల్లా అద్దంకి హెచ్‌డబ్ల్యువో మరణించారు. 2022లో వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల్లో మెనూ కోసం జారీ చేసిన జీవో నెంబర్ 8ని రద్దు చేసి ఆయా జిల్లాల్లో స్థానికంగా ధరలకు అనుగుణంగా మెనూలో మార్పులు, చేర్పులు చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇవ్వాలని హెచ్‌డబ్ల్యూవోలు కోరుతున్నారు. లేదంటే వసతిగృహాల్లో విద్యార్థులకు భోజనం పెట్టడం తలకు మించిన భారమేనని వాపోతున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్సులోనే డ్రైవర్ మృతి

- ప్రయాణికులు క్షేమం



రోడ్డుపక్కన ఆగిని ఆర్టీసీ బస్సు, రసూల్ మృతదేహాన్ని బయటికి తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కావలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రసూల్ (55) గుండెపోటుతో బస్సులోనే మృతి చెందగా.. బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. కావలి డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు గురువారం బెంగళూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలోని రాయచోటి బస్టాండుకు తెల్లవారుజామున వచ్చింది. అనతరం బెంగళూరుకు బయలుదేరగా మదనపల్లె రోడ్డులోకి రాగానే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో ఆయన పక్కకు ఒరిగిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు వచ్చి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సీట్‌లోనే మృతిచెందగా అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ రసూల్ మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందడంతో బస్సు అదుపు తప్పిందా... లేక ఆయన నిద్రమత్తులో ఉండటంతో అదుపు తప్పిందా అనేది పోస్టుమార్టంలో తెలుస్తుందని ట్రాఫిక్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

కలెక్టర్ చొరవతో విద్యార్థినికి కృత్రిమ చెయ్యి



నవోదయ విద్యార్థినికి కృత్రిమ చెయ్యి అమర్చిన వైద్యులు

మదనపల్లె అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వలసపల్లె పంచాయతీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని శివానీకి శుక్రవారం తిరుపతి రిమ్స్‌లో కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గీత పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుట్టుకతోనే ఒక చెయ్యి లేకుండా పుట్టిందని, సొంత పనులు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న శివానీ విషయం కలెక్టర్ శ్రీధర్‌కు తెలియజేశామన్నారు. కలెక్టర్ చొరవతో తిరుపతిలోని రిమ్స్ ఉపసంచాలకులు ఆర్‌వీ కృష్ణకిషోర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఓ శ్రీకాంత్ పర్య వేక్షణలో ఆర్థోటిక్స్ డాక్టర్ జగదీష్ శివానీకి కృత్రిమ చెయ్యిని అమర్చారు. దివ్యాంగు రాలైన శివానీ ఎడమ చేతితోనే 2023 గుజరాత్‌లోను, 2024 బెంగళూరులో నిర్వ హించిన పారా జాతీయ క్రీడల్లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండేళ్లు బంగారు పతకాలు సాధించారన్నారు. 2023లో థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో జావలిన్ త్రో, షాట్‌పుట్‌లో రెండు బంగారు పతకాలను, 2024లో థాయ్‌లాండ్‌లో నిర్వ హించిన అంతర్జాతీయ పారా స్పోర్ట్స్‌లో షాట్ పుట్‌లో బంగారు పతకాల పంట పండించిందని ప్రిన్సిపాల్ వివరించారు. శివానికి కృత్రిమ చెయ్యి అమర్చడంతో మరెన్నో బంగారు పతకాలను సాధిస్తోందని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన పనులు తాను చేసుకోవడానికి కృత్రిమ చెయ్యిని ఏర్పాటు చేయించిన కలెక్టర్ శ్రీధర్‌కు శివాని కృతజ్ఞతలు తెలిపారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి: డిప్యూటీ సీఈఓ

పీలేరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంపై పంచాయతీ అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ వెంకట నారాయణ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం పీలేరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో సుమారు 60 వేలు పైచిలుకు జనాభా ఉన్నారని, అయితే ఇంత వరకూ పట్టణంలో ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో అనువైన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో సంప్రదించి టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జీ. శివశంకర్, ఏఓ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

'కళాకారుల పాత బకాయిలు చెల్లించాలి'

పీలేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాకారులకు అందాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపు రం జిల్లాల కళాకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవా డలోని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు పెంచలయ్యను కలిసి వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ 2018-19 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జన్మభూమి-మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన కళాకారులకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పట్లో రాష్ట్రంలో ఉన్న 13 ఉమ్మడి జిల్లాల్లోని ఆరు జిల్లాల కళాకారులకు బకాయిలు చెల్లించారని, ఆ తరువాత వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. కళలనే నమ్ముకున్న కళాకారులకు ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాప్రదర్శనలు ప్రదర్శించి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు టింగ్ టింగ్ వెంకటేశ్, కళాబృందాల నాయకులు ఖాదర్‌బాషా, కలకట రెడ్డప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక శాఖ రాష్ట్ర సహాయ సంచాలకుడు పెంచలయ్యతో కళాబృందాల నేతలు

రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్

అన్నమయ్యకు బదిలీ

కలికిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నుంచి డిప్యూటీ సర్వేయర్ కె.సుస్మితను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తల కేటగిరీ కింద తనను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయాలని ఆమె చేసుకున్న దరఖాస్తుపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుని బదిలీ ఆదేశాలు జారీ చేసింది. జోన్ మొత్తం మీద 15 శాతం మించి నాన్‌లోకల్ లేకుండా చూసుకోవాలని, జిల్లాలో సీనియారిటీ జాబితాలో స్థానిక ఉద్యోగుల తరువాత నమోదు కావాలనే నిబంధనలు విధిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎర్రచందనం కేసుల కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

మదనపల్లెటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల విచారణ కోర్టు (తిరుపతి) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మదనపల్లె వాసి న్యాయవాది ఎ.అమరనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎస్‌పీపీగా విధుల్లో చేరిన రోజు నుంచి మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనకు గౌరవ వేతనంగా ప్రభుత్వం నెలకు రూ.40 వేలు చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి డైట్ కేంద్రంలో రెండు సంవత్సరాల డీఈఎల్ఈడీ కోర్సు ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయ శిక్షణ పొందగోరే ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డైట్ లాంటి ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో పనిచేయడం గౌరవ ప్రదమైన విషయమన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు శివభాస్కర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ఉషారాణి, నూతన ఛాత్రోపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలను నిర్వహించారు. రాహుకాల పూజల విశిష్టత గురించి అర్చకులు మహిళా భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆక్రమణలపై చర్యలేవి

- తూతూమంత్రంగా మరోసారి నోటీసులు
- పూర్తయిన ఇంటి నిర్మాణం



శుక్రవారం మూడోసారి నోటీసులు అందజేస్తున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

సుండుపల్లె, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటి అక్రమ నిర్మాణంపై చర్యలు మృగ్యమయ్యాయి. అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ సురేశ్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సిబ్బంది పరిశీలించారు. గత వారం రోజుల నుంచి నోటీసులు మీద నోటీసులు ఇచ్చినా అక్రమ ఇంటి నిర్మాణం ఆగలేదు. గురువారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకు చెందిన ఓ వ్యక్తి స్లాబ్ పూర్తి చేశారు. బేస్‌మట్టం నిర్మాణం నుంచి కలెక్టర్, సుండుపల్లె మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. సాక్షాత్తు జిల్లా, నియోజకవర్గ అధికారులే నిర్మాణం ఆపాలని చెప్పినా ఆగలేదు. ఐదు రోజుల క్రితం డీపీవో మస్తాన్‌వలి అక్రమ నిర్మాణం దీనిపై చర్యలు తీసుకుంటామని పల్లెకు వెళ్లి మరీ హెచ్చరించారు. గతంలో రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా నిర్మాణదారులు తగ్గనేలేదు. గురువారం మరోమారు అధికారులు నిర్మాణం ఆపకపోతే కేసు పెడతామని హెచ్చరించి వచ్చారు. అదేరోజు రాత్రి స్లాబ్ పూర్తి చేయడం ఆశ్చర్యంగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో ఈ సంఘటనతో అర్థమవుతుంది. అయితే శుక్రవారం ఎంపీడీవో వెళ్లి ఇకపై కట్టవద్దని చెప్పి వచ్చానని పేర్కొన్నారు. ఉన్నది దొంగ పట్టా, దాన్ని రెవెన్యూ అధికారులు జారీ చేయలేదు. రికార్డుల్లో లేదని తేల్చిన నిర్మాణాన్ని పూర్తి చేయడంపై అధికారులు ఆపలేకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇకపై నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

- ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

ఇంటి నిర్మాణం విషయంలో ఇకపై పనులు చేపడితే కఠిన చర్యలు తప్పవు. ఈ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళతాం.

బొప్పాయి లారీలను అడ్డుకున్న రైతులు



బొప్పాయి కోతలను అడ్డుకున్న రైతులు

చిట్వేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దళారుల రాజ్యంతో బొప్పాయి రైతులు కుదేల వుతున్నారు. ధరల తగ్గింపుతో కడుపు మండిన రైతులు చిట్వేలి మండలంలో గురువారం రోడ్డెక్కారు. అందులో భాగంగా శుక్రవారం రైతులు తమకు గిట్టుబాటు ధర ఇచ్చేవరకు బొప్పాయి కోయనివ్వమని లారీలను అడ్డుకున్నారు. మండలంలోని ప్రతి పల్లె తిరుగుతూ బొప్పాయ కటింగ్‌ను అడ్డుకున్నారు.

అప్పుల ఊబిలో బొప్పాయి రైతులు

బొప్పాయి సాగు చేస్తున్న రైతన్నకు అప్పులే మిగులుతున్నాయి. దీనికితోడు అతివృష్టి, అనావృష్టి వల్ల రైతాంగం అప్పుల ఊబిలో పడిపోయింది. నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు కుదేలవుతున్నారు. ఎకరా పొలంలో బొప్పాయ సాగు చేస్తే నకిలీ విత్తనాలు, నకిలీ నారుతో సగం దిగుబడి కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నట్టేట ముంచుతున్నారు.

దళారుల మాయాజాలం

బొప్పాయి రైతులపై దళారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. గురువారం రోడ్డెక్కిన రైతులు తమకు గిట్టుబాటు ధర కల్పించే వరకు కాయలు కోసేది లేదని తెగేసి చెబుతున్నా వినడం లేదు. కోతలను అడ్డుకున్న రైతులపై దళారులు వాగ్వాదానికి దిగారు. తమకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం జరిగే వరకు కాయలు కోయనివ్వమని రైతులు దళారులను హెచ్చరించారు.

అభివృద్ధి వైపు..

డీసీఎంఎస్ అడుగులు!



కడప నగరంలోని డీసీఎంఎస్ భవనం

గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో నష్టాల్లో కూరుకుపోయి, ఆర్థిక సమస్యలతో ఇంతకాలం సతమతమైన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) క్రమంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వంలో నియమితుడైన పీఐసీ కమిటీ చైర్మన్ జయప్రకాశ్ నేతృత్వంలో వ్యాపార విస్తరణకు సన్నద్ధమవుతోంది. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు సరఫరా చేసే బాధ్యతను నిర్వహిస్తోంది. వైసీపీ హయాంలో ఆ బాధ్యతలను రైతు భరోసా కేంద్రాలకు అప్పజెప్పడంతో.. డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నా.. ప్రైవేటు వ్యాపారులతో పోటీకి తట్టుకోలేక ఇబ్బందులు పడింది. ఈ నేపథ్యంలో సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీలు, గదులు, స్థలాలపై అద్దెల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఐదేళ్ల కాలంలో సుమారు రూ.6 కోట్ల మేర నష్టాలను మూటగట్టుకుంది.

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన డీసీఎంఎస్ నూతన కమిటీ వ్యాపార విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు విక్రయించేందుకు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేయనుంది. మైదుకూరు ప్రాంతంలో ఉద్యానపంటలతో పాటు వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అవసరమైన పురుగు మందులతో పాటు, యూరియా తదితర రసాయనిక ఎరువులను విక్రయించి లబ్ధి పొందాలనే ఆలోచనలో ఉంది. పులివెందుల ప్రాంతంలో చీనీ, అరటిలాంటి పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఆ ప్రాంతానికి సంబంధించిన రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, టార్పాలిన్లు తదితరాలు మామిడి, బొప్పాయి పంటలు ఎక్కువగా సాగయ్యే రైల్వేకోడూరు ప్రాంతంలోఎరువులు, పురుగు మందులతో పాటు, వ్యవసాయ పరికరాలు విక్రయించాలని కమిటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో రాజంపేటలో ఏర్పాటు చేసిన బనానా రైపెనింగ్ చాంబర్‌ను కూడా పరిశీలించి, పరిస్థితులు అనుకూలిస్తే దానిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు యోచిస్తోంది. ఈ విధంగా ఆయా ఏరియాలకు సంబంధించి ఏఏ పంటలు సాగవుతాయి, ఎంత మేర ఎరువుల వ్యాపారం ఉంటుంది. దాని వల్ల ఎంత కమిషన్లు పొందవచ్చనే దానిపై కమిటీ చైర్మన్ జయప్రకాశ్ అధికారులతో చర్చిస్తున్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘంగా చర్చించి ఆయా కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీ, ఇతర పరికరాలు సరఫరాల బాధ్యత డీసీఎంఎస్‌కు అప్పగించే విధంగా సహకరించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు శాఖల అధిపతులతో చర్చించారు.

ఆదాయం అభివృద్ధికి చర్యలు



నష్టాలబారిన పడిన డీసీఎంఎస్‌ను అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చేందుకు జిల్లా అధికారులతో పాటు రైతులు, సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం. కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద ఉన్న స్థలం గతంలో తక్కువ మొత్తానికి లీజుకు ఇచ్చారు. దీనిని పునః పరిశీలించి లీజు మొత్తాన్ని పెంచే అంశాన్ని కూడా ఆలోచిస్తున్నాం.

\- వై.జయప్రకాశ్, చైర్మన్, డీసీఎంఎస్ కమిటీ

స్థలాలు, భవనాల అద్దెలపై దృష్టి

డీసీఎంఎస్‌కు ఉన్న ఖాళీ స్థలాలు, భవనాల అద్దెల ద్వారా మరితం ఆదాయం పొందే విషయంపై పీఐసీ కమిటీ దృష్టి సారించింది. ఇప్పటికే ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన పొందిన వ్యాపారుల నుంచి అద్దె వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా కడప నగరంలోని చెమ్ముమియ్యాపేట వద్ద గతంలో అతి తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చారనే విషయాన్ని పరిశీలిస్తోంది. భవిష్యత్తులో లీజు మొత్తాన్ని పెంచేందుకు యోచిస్తోంది. కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద నిరుపయోగంగా ఉన్న గోదాముకు మరమ్మతులు చేయించి అద్దెకిచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నగర నడి బొడ్డులో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయానికి చెందిన ఖాళీ స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టి రెంట్‌కు ఇవ్వడం ద్వారా మరింత ఆదాయం పొందాలనే యోచనలో కమిటీ చైర్మన్ ఉన్నారు. సొసైటీ ఏర్పడినప్పటి నుంచి టీడీపీకి చెందిన వ్యక్తులు ఎవరూ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించలేదు. ఇప్పుడు మాత్రమే టీడీపీకి చెందిన జయప్రకాశ్‌కు పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడంతో, నష్టాల్లో ఉన్న డీసీఎంఎస్‌ను లాభాల బాటలోకి తీసుకువచ్చి తమ సమర్థతను నిరూపించుకునేందుకు శ్రమిస్తున్నారు.

పాలకవర్గానికి సహకరిస్తాం



డీసీఎంఎస్ అభివృద్ధి కోసం పాలకవర్గానికి సహకరిస్తాం. సొసైటీ బాగుపడితే అటు రైతులకు కానీ, ఇటు సిబ్బందికి కానీ ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు కూడా డీసీఎంఎస్ వినిమయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా అధికారులు తమకు అవసరమైన స్టేషనరీ ఇతర పరికరాల సరఫరాకు మాకు అవకాశం కల్పించాలి.

\- ఎస్.ఖాదర్‌వలి, బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

మెట్రో రైలు నిర్మాణ వ్యయం కేంద్రమే భరించాలి

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం మెట్రో రైలు సౌకర్యాన్ని విభజన జరిగిన సంవత్సరం లోపు కేంద్ర నిధులతో కల్పించాల్సి ఉండగా 50:50 ప్రాతిపదికన కేంద్రం, రాష్ట్రం భరించేటట్లు టెండర్లు పిలవాలని గురువారం రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించడం శోచనీయమన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి 49,485 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని, వెంటనే 80, 515 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400 కోట్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పది వారాలుగా ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందలేదని, ఇందుకు సంబంధించి నిధులు వెంటనే విడుదలచేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మండలానికి ఒక సెంట్రలైజ్‌డ్ కిచెన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి రైతులో మార్పు రావాలి

● జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్



శిక్షణలో పాల్గొన్న రైతులు

లింగాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాగు విధానంలో సమూల మార్పులు చేపట్టాల్సిన సమయం వచ్చిందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని అక్కులగారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేసే ఉదయ్‌కృష్ణారెడ్డి పొలంలో రైతు సేవ కేంద్రం సిబ్బందికి శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విపరీతంగా రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగిస్తుండడంతో ఆహారం విషతుల్యం అవుతోందని, భూసారం తగ్గిపోయి, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం చేసేలా వారికి అవగాహన కల్పించాలని, ప్రస్తుత వ్యవసాయం విధానాల వలన కలిగే దుష్ప్రభావాలు, ప్రకృతి వ్యవసాయం వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో మార్పు కలిగేలా రైతు సేవా కేంద్రం సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, వేముల ఏఓలు చెన్నారెడ్డి, ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

మీరు భయపెడితే భయపడతామా..

● నాకేమైనా జరిగితే మీ కుటుంబాలకు నిద్రలేని రాత్రులే..

● నారా లోకేశ్, బీటెక్ రవిపై వైసీపీ నేత సతీష్‌రెడ్డి ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న సతీశ్ రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె,జూలై 25 (ఆంధ్రజ్యోతి): నీవు భయపెడితే భయపడతామా.. నాకేమైనా జరిగితే నీ కుటుంబానికి నిద్రలేని రాత్రులు ఉంటాయని మంత్రి లోకేశ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిపై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చంద్రబాబునాయుడు, లోకేశ్‌పై విమర్శలు చేశానని వారు చెప్పడమే కాకుండా, తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించడం శోచనీయమన్నారు. మీ నాయకుల కోసం తొందరపడి మాట్లాడొద్దని సూచించారు. మాట్లాడేటపుడు సంస్కారం తో మాట్లాడితే మంచిదని హితవుపలికారు. తనకు, శ్రీనివాస్‌రెడ్డి, బీటెక్ రవి మధ్య ఎటువంటి విభేదాలు లేవని, లోకేశ్ రెచ్చగొట్టడం వల్లే వారు ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేశ్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి పొంది.. విమర్శించడం సిగ్గుచేటు!

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో పదవులు పొందిన సతీశ్ రెడ్డి , ప్రస్తుతం ఆయననే విమర్శించడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం జమ్మలమడుగుకు వచ్చిన ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు కొత్త బిక్షగాళ్ల పొద్దెరగరన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. 20 నుంచి 30 ఏళ్ల టీడీపీలో రాజకీయ లబ్ధిపొందిన తర్వాత వైసీపీలో చేరినవారు చేస్తున్న విమర్శలు పత్రికల్లో చూస్తున్నామన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి గట్టిగా బుద్ధి చెప్పినా ఇప్పటికి వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలు ప్రజలు నమ్మడంలేదన్నారు. సంపద సృష్టికోసం రాష్ట్రానికి అనేక సంస్థలు రాబోతున్నాయన్నారు. ఈ సారి తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నాయకులు చెబుతుండడంతో పారిశ్రామిక వేత్తలు భయపడుతున్నారన్నారు. సతీష్‌రెడ్డి వైసీపీ భజన చేయడం దారుణమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల అధికారంలో ఉండి, అన్ని రకాలుగా లబ్ధిపొందిన కడపజిల్లాలో పులివెందుల సతీష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 300 నుంచి 400 మందికి సోలార్ విద్యుత్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పించామన్నారు. జమ్మలమడుగులో రూ.25 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. 2019లో చంద్రబాబునాయుడు భూములు కోటాయించి మరీ సోలార్ ప్రాజెక్టులను తెస్తే.. వారిని బెదిరించారన్నారు. ఇద్దరూ టీడీపీలో లబ్ధిపొంది వైసీపీలో చేరి చంద్రబాబునాయుడుపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆ ఇద్దరూ బాధితులే అన్నారు. అన్ని రకాలుగా ఇబ్బందులు పడి తిరిగి ఆయన కుమారుడు జగన్ చెంత చేరి రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జమ్మలమడుగులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీగా సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌ఆర్జేడీగా సురేష్‌బాబును నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా వృత్తి విద్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబుకు కడప ఆర్జేడీ (ఎఫ్ఏసీ)గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కడప ఆర్జేడీగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు జూన్ 30న పదవీ విరమణ చేశారు. నేడో, రేపో సురేష్‌బాబు బాధ్యతలను స్వీకరించనున్నారు.

కేజీబీవీల్లో జీసీడీవో తనిఖీలు

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాపాడు, జమ్మలమడుగు, పెద్దముడియం కేజీబీవీలను జీసీడీఓ రూతు ఆరోగ్యమేరీ శుక్రవారం సందర్శించారు. డార్మెటరీ, మరుగుదొడ్లు, కిచెన్, స్టోర్ రూమ్, క్లాస్‌రూమ్‌లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన కృత్యాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఏంజెల్ ప్రణీత, నాగలక్షుమ్మ, మౌనిక, సిబ్బందికి తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో డీఎస్పీ విచారణ

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన కేసులో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. స్థానికులను, బాధితురాలిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం విరిగిపడి గొర్రెలు మృతి

మైదుకూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) విద్యుత్ స్తంభం విరిగిపడి ఆరు గొర్రెలు మృతి చెందినట్లు విద్యుత్ శాఖ ఏఈ వీరభద్రయ్య తెలిపారు. మైదుకూరు మండలంలోని సోమయాజులపల్లె గ్రామ పరి .దిలో పెనుగాలులకు కరెంటు స్తంభం విరిగి పక్కనే అదే గ్రామానికి చెందిన సిద్దం రుక్మిణమ్మ అనే మహిళకు చెందిన గొర్రెలపై పడడంతో 6 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదంతో తమకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు

పులివెందుల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తుపాకీతో పట్టపగలు ఓ వ్యక్తిని కాల్చిచంపిన భరత్‌యాదవ్ హతుడి తల్లిపైనా దాడి చేయడంతో హత్యాయత్నం కేసు నమోదైందని పులివెందుల సీఐ చాంద్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. 2023లో పులివెందుల నడిబొడ్డున బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన తుపాకీతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తిని భరత్‌యాదవ్ కాల్చి చంపాడు. ఈ హత్య కేసు ప్రస్తుతం రాజీ చేసుకునేందుకు కొన్ని రోజులుగా భరత్‌యాదవ్ ప్రయత్నిస్తున్నాడు. గురువారం దిలీప్‌కుమార్ ఇంటివద్దకు పెద్ద మనుషులను పంపి రాజీ చేసుకునేందుకు ప్రయత్నించాడు. అందుకు దిలీప్‌కుమార్ తల్లి మస్తానమ్మ ఒప్పుకోలేదు. దీంతో శుక్రవారం ఉదయం 6.15గంటల ప్రాంతంలో భరత్‌యాదవ్ వారింటికి వెళ్లి ఈ కేసులో రాజీకి రాకుంటే చంపేస్తానంటూ మస్తానమ్మను బెదిరించాడు. రాజీకి మస్తానమ్మ ఒప్పుకోకపోవడంతో.. ఆమెను జట్టుపట్టుకొని ఈడ్చి కొట్టాడు. దీనిపై మస్తానమ్మ పోలీసులను ఆశ్రయించడంతో భరత్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి వెల్లడించారు. దువ్వూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ శనివారం కడప పర్యటనకు వస్తున్నారని అన్నారు. బీజేపీ బలోపేతానికి మొదటగా రాయలసీమ జిల్లాలోని కడపను ఎంపిక చేసి పర్యటన చేపడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ, జాతీయ రహదారుల అభివృద్ధి, కడప-రేణిగుంట రైల్వే అభివృద్ధి, మైదుకూరు మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం, కడప విమానాశ్రయ అభివృద్ధి లాంటివాటికి నిధులు కేటాయించారని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, ధార్మికసెల్ జిల్లా కన్వీనర్ బాస్కర్‌రెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ప్రతాప్, పాల్గొన్నారు.

శిశువుల్లో జన్యు రుగ్మతలకు

ఉచిత స్క్రీనింగ్

కడప సెవెన్ రోడ్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనన దశలో, గర్భధారణ సమయంలో శిశువుల్లో జన్యుపరమైన రుగ్మతలను నిర్ధారించేందుకు రిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ అందుబాటులోకి వచ్చిందని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), న్యూఢిల్లీ అందించే ఉమ్మీద్ అవుట్‌రీచ్ ప్రాజెక్ట్ కడప ప్రభుత్వ వైద్యశాలకు లభించిందన్నారు. మన రాష్ట్రంలో కడప జిల్లా మాత్రమే ఈ ప్రాజెక్టు కింద ఎంపికైందన్నారు. ఇది మూడు సంవత్సరాల పాటు నిధులందించే ప్రాజెక్టు అని ఇందులో 30,000 మంది గర్భిణిలకు హిమోగ్లోబినోపతీ కోసం, 15,000 నూతన శిశువులకు జన్యుపరమైన మెటబాలిక్ రుగ్మతల కోసం ఉచితంగా స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం జన్యు, మెటబాలిక్ రుత్మతలను తొందరగా గుర్తించి చికిత్స అందించడమని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సేవలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రియుడి మోసానికి యువతి బలి!



ప్రశాంతి (ఫైల్ ఫొటో)

కుప్పం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన ఓ యువతి ప్రియుడి మోసానికి బలైపోయింది. ప్రియుడి ఇంటి ముందే శరీరం మీద పెట్రోలు పోసుకుని నిప్పటించుకుని తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. చిత్తూరు జిల్లా కుప్పంలో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఈ విషాదం సంచలనం సృష్టించింది. డీఎస్పీ పార్థసారథి కథనం మేరకు... కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన వాసు గతంలో కడపలో నివాసముంటూ మైదుకూరులోని ఓ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేసేవాడు. అప్పటికే అతడికి స్వగ్రామంలో భార్య, ఒక కుమారుడు ఉన్నారు. అదే సమయంలో కడపకు చెందిన కేజీవీ ప్రశాంతి (24) ప్రొద్దుటూరులోని ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ విభాగంలో పనిచేసేది. వీరిద్దరికీ పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. అయితే తనకు వివాహమైన విషయం వాసు దాచిపెట్టాడు. ఏడాదినుంచి తనను పెళ్లి చేసుకోవాల్సిందిగా వాసును ప్రశాంతి ఒత్తిడి చేయసాగింది. దీంతో వాసు చెప్పాపెట్టకుండా స్వగ్రామమైన మార్వాడకు వచ్చేశాడు. ఈ నేపథ్యంలో ఎలాగో వాసు చిరునామా తెలుసుకున్న ప్రశాంతి, ఈనెల 23న మార్వాడకు వచ్చి తనను పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఒత్తిడి తెచ్చింది. వాసు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆమె తల్లి అయిన మాలతిని కడపనుంచి పిలిపించి సర్దిచెప్పి తల్లితోపాటు పంపించేశారు. అయితే ప్రశాంతి గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి మార్వాడ చేరుకుంది. వాసు ఇంటి ఆవరణలోకి ప్రవేశించి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు పెట్టుకుంది. వెంటనే వాసుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సాయంతో మంటలను ఆర్పి ప్రశాంతిని కుప్పంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం ఆమెను పీఈఎస్ ఆసుపత్రికి, అక్కడినుంచి తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకువెళ్లి చేర్చారు. అప్పటి నుంచి రుయాలో చికిత్స పొందుతూ ప్రశాంతి శుక్రవారం ఉదయం మృతి చెందింది. కాగా ఆమె మృతికి కారకుడైన వాసును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ప్రశాంతి తల్లి మాలతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.

శ్రావణమాస ఉత్సవాలకు 'గండి' సర్వం సిద్ధం



గండి క్షేత్రంలో ఏర్పాటుచేసిన చలువపందిళ్లు

చక్రాయపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో ఈనెల 25 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అందులో భాగంగా శుక్రవారం నాటికే వచ్చే భక్తాదుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చలువపందిళ్లు, తాగునీరు, షెడ్లు, ప్రసాదాలు, విద్యుత్ అలంకరణలు పూర్తిచేశారు. అంజన్న దర్శనం కోసం రాయలసీమ నుంచిభారీగా భక్తులు వస్తారు. వారిని దృష్టిలో పెట్టుకుకిన పాపాఘ్నిలో కాల్వల ఏర్పాటు, షెవర్లు ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అవుట్‌పోస్టు, వైద్యశిబిరంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి అలాగే సేవా కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకుడు కేసరి, ఉప ప్రధాన అర్చకుడు రాజారమేశ్ భక్తాదుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉంది.

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

ఎమ్మెల్యే మాధవి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. శుక్రవారం కడప నగరం రెండో డివిజన్ ఉక్కాయిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించివారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేమార్గాన్ని తెలియజేశారు. అనంతరం ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు, కొత్తగా ఏర్పాటుచేసిన బోరుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమా విజయం పట్ల హర్షం



తుంగ రమణయ్యఆధ్వర్యంలో సంబరాలు చేస్తున్న జనసేన సభ్యులు

కడప సెవెన్ రోడ్స్ జూలై 25 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో రాజా థియేటర్‌లో బాణసంచా పేల్చి కేక్ కట్‌చేసి మెగా అభిమానులు, జనసైనికులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పండ్రా రంజిత్‌కుమార్,కడప జనసేన నాయకులు తుంగారమణయ్య, శేషు రాయల్, చైతన్య, గణేష్, శ్రీకాల ప్రవీణ్, బ్రహ్మంనాయక్, బాలునాయక్,సుధీర్‌నాయక్, గోపాల్‌నాయక్, సాయికృష్ణ ఆచారి, వెంకట్, శ్రీను,శ్రీకాంత్, శ్రీనాథ్, సాయి,సాబీర్, నవీన్, జయదేవ్, రామకృష్ణ, తరుణ్, మస్తాన్ చెర్రీ, బాబ్జి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

సీకేదిన్నె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సమీపంలోని పాలకొండ్రాయుడు దేవస్థానంలో శనివారం నుంచి శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో ప్రతి శనివారం బాలాజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ ఏటూరు రామచంద్రారెడ్డి తెలిపారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కడప గడప నగర పరిధిలో పాలకొండ్రాయుడుగా వెలసి భక్తులను నిత్యం కటాక్షిస్తున్నారని, ఈ సందర్భంగా శ్రావణమాసంలో ప్రతి శనివారం పాలకొండ్రాయుడు పాదాల చెంత భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

'ఎరువుల కొరత తీర్చకపోతే ఆందోళన తప్పదు'

కడప సెవెన్‌రోడ్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న ఎరువుల కొరతను తక్షణం తీర్చకపోతే ఆందోళన తప్పదని శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో77475 హెక్టార్లు పంటల సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా గట్టి సీజన్ అంతటికి 69600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని జిల్లా అధికారుల విన్నపాన్ని రాష్ట్ర ప్రభుత్వం 40390 మెట్రిక్ టన్నులు కేటాయించిందన్నారు. అయితే ఈ నాలుగు మాసాలకాలంలో కేవలం 7146 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందన్నారు. 20500 మెట్రిక్ టన్నులయూరియా అవసరం కాగా 12వేల మెట్రిక్ టన్నులు కేటాయించి చివరకు 3062 మెట్రిక్ టన్నులు ఇచ్చిందన్నారు. 9800 మెట్రిక్ టన్నుల డీఏపీ అవసరం కాగా 480 టన్నులు కేటాయించి చివరకు 1800 టన్నులు మాత్రమే ఇచ్చిందన్నారు. 32700 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరం కాగా 20వేల టన్నులు కేటాయించి కేవలం 2002 మాత్రమే ఇచ్చిందన్నారు. 2007 మెట్రిక్ టన్నుల ఎంఓపీ అవసరం కాగా 1620 టన్నులు కేటాయించి ఒక్క కేజీ కూడా ఇవ్వలేదన్నారు. 3700 మెట్రిక్ టన్నుల సూపర్ సింగల్ పాస్ఫేట్ అవసరం కాగా 1690 టన్నులు కేటాయించి ఇవ్వలేదన్నారు. అంచనాలకు భిన్నంగా కేటాయించడమే కాకుండా, కేటాయించిన వాటిని కూడా ఇవ్వకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు



సాగును పరిశీలిస్తున్న దృశ్యం

పెండ్లిమర్రి,జూలై 25 (ఆంధ్రజ్యోతి):సేంద్రియ వ్యవసాయంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏడీఏ సురేష్ రెడ్డి తెలిపారు. చెన్నమరాజుపల్లెలో శుక్రవారం కడప డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం జరిగింది.ఇందులో భాగంగా ఆదర్శరైతు గంగిరెడ్డి పొలంలో ఘనద్రవ జీవా మృతాలు,వేప కషాయం తయారు చేసే విధానం,వాటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరిం చారు.ఏడీఏ ఆధ్వర్యంలో ఏటీఎం మోడల్ పంటల సాగు, నవధాన్యాల పంటలు సాగు చేసిన పొలాలను సందర్శిం చారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు మిగతా రైతులకు కూడా తెలియ చేసి వారిని మార్చాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో ఏవోలు సుమంత్‌రెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, నాగార్జున, శ్రీదేవి ఏఈవో గంగాధర్‌రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు



కషాయం తయారు చేస్తున్న దృశ్యం

వల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు,కమలాపురం మండలంలోని రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి శుక్రవారం ఏపీ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వల్లూరు మండలంలోని పెద్దపుత్త గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా సిబ్బందికి నాచురల్ ఫార్మింగ్, గ్రోతింగ్ ప్రమోటర్స్, జీవామృతాలు, కషాయాల తయారీపై డెమో చేసి చూపించారు. అనంతరం పీఎండీఎస్‌లో 25 రకాల విత్తనాలతో సాగు చేసిన పొలాన్ని పరిశీలించారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సాంకేతిక అధికారి నాగభూషణ్‌రెడ్డి, ఏపీసీఎంఎఫ్ డివిజనల్ యాంకర్ వెంకట్రామిరెడ్డి, ఏపీ సీఎం సిబ్బంది, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

Form No. 18
Notice for Appearance in Appeals order 41 Rule 14 CPC, and Rules 1, 2, 4 and 11 of Chapter IV Karnataka High Court Rules
In the High Court of Karnataka at Bengaluru
MFA No. 861 / 2020 (MV/SJ)

Appellant : 1. The Manager, The New India Assurance Co. Ltd., Motor TP Hub, Mahalakshmi Chambers, No. 9, 2nd Floor, M.G. Road, Bengaluru - 560 001.

By Smt. Manjula N. Tejaswi, Adv.

-V/s-

Respondents : 1. Kumari S. Asifa, D/o. S. Chand Basha, Aged about 9 years, Minor, Rep. By R-3 Mother Natural Guardian (P. Saidan Been), Permanent residents of No. 7-57/A, Ramapuram, Karasanapalle, Battam Doddi, District Chittoor, Andhra Pradesh. And others.

Appeal from the Judgement / Award / Order passed on 19/08/2019 in M.V.C. Number 2976/2017 on the file of the III ADDL. Judge & Member, MACT, Court of Small Causes, Bengaluru (SCCH-18).

To : Respondent No. 4

4. Sri M. Rajashekar Reddy, S/o. M. Lakshmireddy, Age : Major, R/o C. Buddayapalli Village, District Kadappa, Andhra Pradesh.

Whereas the aforementioned appeal preferred has been registered by this Court.

Notice is hereby given to you to appear in this Court in person or through an Advocate duly instructed or through some one authorised by law to act for you in this case on **19/08/2025 at 10.30 a.m.**, in case you intend to contest the appeal. If you fail so to appear, the appeal will be dealt with, heard and decided in your absence.

Given under my hand and the seal of this Court on 21st day of July 2025.

By Order of the Court,
ASSISTANT REGISTRAR

టెండర్ వేసిన వారికే ఆర్టీసీ బస్టాండ్‌లో అద్దె గదులు కేటాయించాలి

కడప మారుతీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వ్యాపార సముదాయ అద్దె గదుల కోసంగా టెండర్లు వేసి 6 నెలలు అవుతున్న దళిత మహిళ స్రవంతికి ఇంతవరకు గదులు కేటాయించకుండా కాలయాప చేస్తున్న ఆర్టీసీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట బాధితురాలు స్రవంతితో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి సుబ్బరాయుడు, సగిలి గుర్రప్ప, బి.సి. గంగులు సుబ్బరాయుడు, ఆంజనేయులు, ఓబులేసు, ప్రసాద్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగం గా శుక్రవానం నగరంలోని రామరాజు పల్లెలో పరమేశ్వర హైస్కూలు విద్యార్థుల కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప తాలుకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీచైతన్య హైస్కూలులో శుక్రవారం విద్యార్థినులకు సైబర్ నేరాలు, మోసపూరిత యాప్‌లు, చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల హెడ్మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

కడప ఎర్రముక్కపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అడిషనల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేయర్ సురేష్‌బాబుకు, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రంకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరికృష్ణ, రాజు,పెంచలయ్య, దాసు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

లింగాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్ఎమ్‌లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. లింగాల పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య సిబ్బందికి ఏర్పాటుచేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ గర్భిణీలను నిరంతరం పరిశీలిస్తూ పోషక ఆహారం తీసుకోవడం వివరించాలన్నారు.

'ఆ ఎంఈఓలను సస్పెండ్ చేయాలి'

కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప, ప్రొద్దుటూరు ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కడప పాఠశాల విద్యఆర్జేడీ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి మెప్పు కోసం పేట్రేగిపోవడం తగదు

టీడీపీ సీనియర్ నాయకుడు జి. లక్ష్మిరెడ్డి



కడప మారుతీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల చీత్కారంతో అధికారం కోల్పోయి పూర్తి వైరాగ్యంలో కొట్టుమిట్టాడుతున్న వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి మెప్పు కోసం ఆ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మరీ పేట్రేగిపోతూ చంద్రబాబు , లోకేశ్‌పై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడం తగదని టీడీపీ సీనియర్ నాయకుడు జి. లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ దోషులంతా ముందస్తు బెయిల్ కోసం నానా తంటాలు పడ్డా అవి నిరాకరించడం జరిగిందన్నారు. దీంతో ఇక అరెస్ట్ తప్పదని వారికి అర్థమై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారంటూ చంద్రబాబు, లోకేశ్‌పై పరుష పదజాలంతో సతీష్‌రెడ్డి దూషణలకు దిగడం పద్ధతిగా లేదన్నారు. ఏదేని బహుమతికి ఆశపడి వుంటే జగన్‌రెడ్డి భజన చేసుకోవాలే కానీ దుందుడుకు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు.కాగా సూపర్ సిక్స్ పథకాల అమలుతో రాష్ట్రంలో వైసీపీ అడ్రస్ లేకుండా పోతున్నదన్నారు. ఇప్పటికైనా సతీశ్‌రెడ్డి నోటి దురుసు తగ్గించుకుని పద్ధతిగా మాట్లాడాలని హితవు పలికారు.

విజయదుర్గాదేవి ఆలయలో శ్రావణమాస సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయం లో భక్తుల సందడి నెలకొంది. అత్యధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మ వారికి ప్రత్యేక అభిషేకం, అనంతరం ఉదయం 10 గంటలకు కుంకుమార్చన (సుమంగళిపూజ) నిర్వహించారు. పూజకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాత్రి అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

కడప క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారమని వక్తలు పిలుపునిచ్చారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో శుక్రవారం యాంటీడ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి విక్రయిస్తున్న వారి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నెం.1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు ఏ మూల విక్రయించినా దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మిసెస్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

సీకేదిన్నె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 89లో 8.68 ఎకరాలు రస్తా పొరంబోకు ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని తెలుసుకుని శుక్రవారం వీఆర్వోలను పంపి అక్కడ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అతిక్రమించినయెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు జిల్లా పర్యటనకు రానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

కడప మారుతీనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనకు ఈనెల 27వ తేదీ ఆదివారం రానున్నారని భారతీయ జనతాయువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర నాయకుడు బత్తల పవన్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ వెల్లడించారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాటాడారు. జిల్లా పర్యటనకు రాగానే దేవుని కడపలో వెలసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని పార్టీ శ్రేణులను కలుసుకుంటారన్నారు. ఆదివారం ఉదయం కడప వై జంక్షన్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమం తలపెట్టామన్నారు. ఈ ర్యాలీ ఎన్‌జీఓ కాలనీ మీదుగా అప్సరా సర్కిల్, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్, అశోక్‌నగర్, పాతబైపాస్, ఆదిత్య కల్యాణమండపం వరకు సాగుతుందన్నారు. అనంతరం అక్కడ పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం జరుగనుందన్నారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి పృథ్వీనారాయణ, కోశాధికారి శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె..బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పిలుపునిచారు. శుక్రవారం వేంపల్లెలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.సునీల్‌కుమార్, చరణ్, శ్రీనివాసులు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణలో భాగస్వాములు కండి

పులివెందుల రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమల నివారణలో భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మురుగునీరునిల్వ ప్రాంతాలో అబేట్ పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ దోమల వలన ప్రాణాంతక డెంగీ,మలేరియా, చికెన్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. అలాగే దోమల పెరుగుదలకు అవకాశం ఉన్న నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మాధవిదేవి, సరస్వతి, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కడప ఎంఈఓ-1గా రఫిక్ అహ్మద్



కడప ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కడప ఎంఈఓ-1గా రఫిక్ అహ్మద్‌ను నియమిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు.కడప శంకరాపురం ప్రభుత్వ అంధుల పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రఫిక్ అహ్మద్‌ను కడప ఎంఈఓ-1గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇప్పటి వరకు కడప ఎంఈఓ-1 ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన చెన్నూరు ఎంఈఓ గంగిరెడ్డి చెన్నూరు మండలం ఎంఈఓ-1గా కొనసాగనున్నారు. అయితే ఎంఈఓ-1 బాధ్యతలను రఫిక్ అహ్మద్ నేడో, రేపో స్వీకరించనున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా : డ్రైవరుకు స్వల్పగాయాలు

వల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై వల్లూరు మండల పరిధిలోని గోటూరు పెట్రోలు బంకు, దర్గా మధ్యలో ఓ వెంచర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన సమయంలో ఓ లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయింది. లారీ అనంతపురం నుంచి చెన్నై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవరు నిద్రమత్తు కారణంగా వాహనం అదుపు తప్పినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవరు కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అంజన్న సన్నిధికి కాలినడకన భక్తులు



వీరపునాయునిపల్లె, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా సుమారు 300 మంది మహిళలు,పిల్లలు,పెద్దలు కలిసి గండి క్షేత్రానికి కాలినడకన బయలుదేరారు. వీరు ఎర్రగుంట్ల మండలం నుంచి వీరపునాయునిపల్లె మీదుగా వెళ్లారు. గండి క్షేత్రంకు చేరుకొని స్వామివారిని దర్శించుకోనున్నామని తెలిపారు.

గర్భిణులపై పర్యవేక్షణ ఉండాలి : జేసీ

కడప కలెక్టరేట్, జూలై 25,(ఆంధ్రజ్యోతి): గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణతో పాటు వైద్యులు, ఐసీడీఎస్ సిబ్బంది అంకిత భావంతో పని చేస్తే మాతృమరణాలు అరికట్టగలమనిజాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా స్థాయి ప్రసూతి మరణాల విచారణ(డీఎండీఎస్) కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలో 2025 జనవరి నుంచి మార్చి వరకు సంభవించిన 3 ప్రసూతి మరణాలకు సంబంధించి, బాధిత కుటుంబ సభ్యులు,పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వైద్యాధికారులతో. అంగన్వాడీ సిబ్బందితో విచారణ నిర్వహించారు.ఈకార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఐసీడీఎస్‌పీడి శ్రీలక్ష్మీ, తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాత స్టాక్ ఉంటే ఎంఎల్ఎస్ పాయింట్ లోనే రీప్లేస్ చేయాలి..: అంగన్వాడీ కేంద్రాలలో ఐదు నెలల కంటే ముందు స్టాక్ ఉంటే ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే రీప్లేస్ చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అంగన్వాడీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్లో సివిల్ సప్లైయ్ శాఖ పరిధిలో బియ్యం, ఇతర నిత్యవర సరుకులు సరఫరాపై అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రతి నెల 3 వ తేదీ లోగా అన్ని కమోడిటీస్ ఒకే సారి పీఎప్ షాపులకు చేరాలని, 5 లోగా అంగ న్వాడీ సెంటర్లకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఎల్ఎస్ పాయిం ట్ నుంచి కమోడిటీస్ అంగన్వాడీ కేంద్రాలకు చేరేంత వరకు వస్తున్న సమస్యలును పీఎప్ షాపు డీలర్లు వాట్సాప్ గ్రూపులో షేర్ చేయాలన్నారు.

ఎస్సీ,ఎస్టీ నర్సింగ్ మహిళకు జర్మన్ బాషలో ఉచిత శిక్షణ

సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతి

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జర్మనీ దేశంలో అధిక సంఖ్యలో ఉన్న వృద్ధుల అవసరాలకు తగ్గట్లుగా నర్సులు అందుబాటులో లేనందు వల్ల అక్కడి ప్రభుత్వం మనదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి నర్సులను నియమించే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని ఎస్సీ ఎస్టీ నర్సింగ్ మహిళలకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ కోర్సు చేసి ఆ రంగంలో ప్రావీణ్యం పొందిన వారికి జర్మనీలాంటి దేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగభద్రత కల్పించబడునని ఆమె తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో మూడు కేంద్రాల్లో జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో కేంద్రంలో 50మంది చొప్పున అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో 25 మంది ఎస్సీ, 25 మంది ఎస్టీలకు బీఎస్సీ నర్సింగ్, బీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన వారికి 8 నుంచి 10 నెలలు పాటు వసతితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖపట్టణం, గుంటూరు, తిరుపతి కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

35 సంవత్సరాల్లోపు వయసు ఉన్న మహిళలు అర్హులని బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండుసంవత్సరాలు క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. అదే విధంగా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసిన వారు మూడుసంవత్సరాల క్లినికల్ అను భవం కలిగి ఉండాలని అన్నారు. జర్మన్‌భాష లో 8 నుంచి పదినెలల శిక్షణ పొంది బీ2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని తెలి పారు. ఆసక్తి ఉన్న వారు నర్సింగ్ డిగ్రీ సర్టిఫికెట్, క్లినికల్ అనుభవ పత్రం, ఏపీ స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఆధార్, కులధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటోను జత చేసి అర్హతలు ఉండి ఆసక్తి కలిగిన వారు వారి దరఖాస్తులు స్కాన్ చేసి పంపాలన్నారు.

పీ-4 అమలు చేసేందుకు చర్యలు

కొండాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీ-4 కార్యక్రమాన్ని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ఏవో సుబ్బయ్య తెలిపారు. పీ-4 కింద పేద కుటుంబాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మండలంలో మార్గదర్శకులను గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దేవగుడిలో స్మార్ట్‌కిచెన్ తనిఖీ చేసిన కలెక్టర్



జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడి గ్రామంలో శుక్రవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్మార్ట్ కిచెన్ పనులను పరిశీలించారు. స్మార్ట్‌కిచెన్ నుంచి జమ్మలమడుగులోని పలు ప్రాంతాలలోని విద్యార్థులకు భోజనాలు తయారు చేసి పంపించే కేంద్రం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆలస్యంపై గ్రామస్థుల అభ్యంతరం

కాశినాయన జూలై25(ఆంధ్రజ్యోతి) మండలంలోని వరికుంట్ల ఎస్సీకాలనీ, నాయనపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు పాఠశాల సమయానికి రాకపోవడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇలా సమయానికి ఉపాధ్యాయులు రాకపోవడంవల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుల్లో వెనుక పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయుడిని ఎంఈవో ఎందుకు పంపలేదని వారు ప్రశ్నిస్తున్నారు. .ఈవిషయంపై ఎంఈవో నిర్మలను వివరణకోరగా తాను అనారోగ్యంతో మధ్యాహ్నం వరకు సెలవు పెట్టి మధ్యాహ్నం నుంచి డ్యూటీకి వచ్చానన్నారు. వరికుంట్ల ఎస్సీకాలనీలో పనిచేస్తున్న మినిమం టైమ్ స్కేల్ టీచర్(టిఎంఎస్) అబ్దుల్ అజీద్ ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు గైర్హాజరుకావడంతో వరికుంట్ల యూపీస్కూల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడు రమణారెడ్డిని వెళ్లాలని ఆదేశించారన్నారు. నాయనపల్లె పాఠశాలకు అర గంట ఆలస్యంగా ఉపాధ్యాయుడు వచ్చినా సాయంత్రం 4 వరకు పాఠశాల నిర్వహించాడన్నారు. పాఠశాలకు డుమ్మాకొట్టిన వరికుంట్ల ఉపాధ్యాయుడిపై డీఈవోకు ఫిర్యాదు చేశామన్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

చాపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. మైదుకూరు మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ నాయబ్‌రసూల్, టీడీపీ నాయకులు అక్బర్‌వలి, దాసుమియా, బయపురెడ్డి, అక్బర్‌సలీం, సుబ్బరాయుడు, కిరణ్, తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు.

కొండగోపాలస్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు

అట్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కొండూరు పడమటి భాగంలో కొండలో వెలసిన కొండ గోపాలస్వామి ఆలయంలో శ్రావణమాస వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోవిందగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి భక్తులు కొండపైకి చేరుకుని కొండగోపాలస్వామిని దర్శించుకుని తరించారు.

రైతుమిత్ర సంఘానికి డ్రోన్ పంపిణీ

చాపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన దస్తగిరిస్వామి రైతు మిత్ర సంఘానికి మైదుకూరు వ్యవసాయ సంచాలకుడు కృష్ణమూర్తి, ఏవో పద్మలత, యూనియన్ బ్యాంకు మేనేజర్ రమణ శుక్రవారం డ్రోన్ పంపిణీ చేశారు. డ్రోన్ రూ.9.8 లక్షలు విలువ చేస్తుందని ఇందులో 80 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు ఏవో పేర్కొన్నారు. ఏఈవో స్వప్న, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

మైదుకూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) :నంద్యాలపేట మాజీ సర్పంచ్ నేట్లపల్లి చిన్న సుబ్బయ్య వయోభారంతో శుక్రవారం మృతి చెందినట్లు ఆయన కుమారుడు టీడీపీ కడప జిల్లా ఆర్గనైసింగ్ సెక్రటరీ నేట్లపల్లి మల్లిఖార్జున్‌యాదవ్ తెలిపారు. చిన్న సుబ్బయ్య మృతి పట్ల మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సంతాపం తెలిపారు. ఒక మంచి నాయకుడ్ని కోల్పోయినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

● ఈ-పంట నమోదులో తక్కువ విస్తీర్ణం చూపిన వైనం ● సంచర్లలో కలిపిన పోరుమామిళ్ల రైతు సేవాకేంద్రాలు ● ఆందోళనలో అన్నదాతలు

పోరుమామిళ్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు చేసిన ఈ-పంట నమోదు నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రమైన పోరుమామిళ్ల రైతులు తీవ్ర ఇక్కట్లుపడుతున్నారు. దీంతో మండలకేంద్రాల్లోనే పెద్ద మండలంగా పేరున్న పోరుమామిళ్లలోని నాలుగు రైతు సేవాకేంద్రాలను సంచర్ల పంచాయతీలో ఉన్న రైతు సేవాకేంద్రంలో కలిపేశారు. ఇక నుంచి రైతులు వ్యవసాయ అవసరాల పనుల కోసం సంచర్లలోని రైతు సేవాకేంద్రానికి సుమారు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తోంది. ఒక రైతు సేవాకేంద్రం పరిధిలో వెయ్యి ఎకరాలు నమోదు ఉండాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు ఈ-పంట నమోదు తక్కువ చేశారు. ఇందులో పోరుమామిళ్ల 1వ రైతు సేవాకేంద్రంలో 72 ఎకరాలు రెండో రైతు సేవాకేంద్రంలో 87 ఎకరాలు, 3,4 రైతుసేవా కేంద్రాల్లో ఎలాంటి పంటలు ఖలేకపోవడంతో ప్రభుత్వం సంచర్లలో కలిపింది. ఎరువులు, విత్తనాలు తదితరాలు కావాలన్నా రైతులు వ్యయప్రయాసాలకోర్చాల్సిన పరిస్థితి ఎదురైంది. పోరుమామిళ్ల చెరువు ఆయకట్టు దాదాపు అధికారికంగా 4600 ఎకరాలు అనధికారికంగా దాదాపు 10వేల వరకు ఉండవచ్చని అంచనా. ఈ చెరువు కింద ఎంత ఆయకట్టు ఉన్నా ఈ-పంట నమోదు తక్కువ కారణంగా పోరుమామిళ రైతులందరినీ ఇబ్బంది పెట్టడం సరికాదంటున్నారు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలో పోరుమామిళ్ల, బికోడూరు, కలసపాడు, కాశినాయన, బి.మఠం మండలాలు వస్తాయి. ఈ డివిజను మొత్తం కలిపి 65 రైతు సేవాకేంద్రాలుంటే ప్రస్తుతం ఈ-పంట నమోదు కారణంగా 44 మాత్రమే ఉండిపోయాయి. మండల కేంద్రంలోనే రైతు సేవాకేంద్రాలను తరలించడం దారుణమని రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యమంటున్న కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని యథాతదంగా కొనసాగించాలని కోరుతున్నారు. అంతేకాక పుల్లీడు, రజాసాహెబ్‌పేటలో కలపడం వల్ల ఆ ప్రాంత రైతులకు కూడా రైతు సేవాకేంద్రం దూరంగా ఉంటోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పోరుమామిళ్లలో మూతపడిన నాలుగో రైతు సేవాకేంద్రం

పోరుమామిళ్లలోనే రైతు సేవా కేంద్రాలు కొనసాగించాలి

పోరుమామిళ్లలోనే రైతు సేవాకేంద్రాలలను కొనసాగించాలని పోరుమామిళ్ల మేజరు పంచాయతీరాజ్ సర్పంచ్ యనమల సుధాకర్ డిమాండ్ చేశారు. నాలుగు మండలాల్లోకల్లా అతి పెద్ద మండలమైన పోరుమామిళ్ల మేజరు పంచాయతీ అని, గతంలో ఇక్కడ పంచాయతీ అన్నారు. అలాంటి చోట రైతు సేవాకేంద్రాలను దూరంగా సంచర్లలో కలిపి రైతులను ఇబ్బందిపెట్టడం సమంజసం కాదన్నారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఏడీఏ ఏమన్నారంటే: ఈ విషయమై వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ-పంట నమోదును పరిగణనలోకి తీసుకుని కనీసం వెయ్యి ఎకరాలు ఈ-పంట నమోదైన రైతు సేవాకేంద్రాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తక్కువగా నమోదైన రైతు సేవాకేంద్రాల్లోని ప్రాంతాలను, సమీపంలో ఉన్న ప్రాంతాలకు కలిపారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

శ్రీహరికోట విజ్ఞానయాత్రకు బస్సు సర్వీసులు ఏర్పాటు

బద్వేలు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట సతీష్ దావన్ అంతరిక్ష కేంద్రంలో సీఎస్‌ఎల్‌వీ ఎఫ్16 మిషన్ లాంచింగ్ జరుగుతున్న కారణంగా ఈనెల 30న శ్రీహరికోట విజ్ఞాన యాత్ర కోసం బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఆయావిద్యాసంస్థల నుంచి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు లెక్చరర్లు వారి వివరాలను ఆధార్‌కార్డుతో సహా జాబితా తయారు చేసుకుని డిపోలో అందజేయాలని కోరారు. ఉదయం 6గంటలకే ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు, చార్జి ధర రూ.800 ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని అయితే ఆయా కళాశాలల పాఠశాలల ద్వారానే ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 9959225779 నెంబరుకు సంప్రదించాలన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దువ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్మికులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఆగస్టు 7న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

చాపాడులో: చాపాడులోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామలింగారెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, డివిజన్ ప్రధానకార్యదర్శి నాయబ్‌రసూల్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని 2022 పీఆర్‌సీ అరియర్స్ , కొత్త ఆపరేటర్లకు జీతాలు పెంచాలని కోరారు. ఈ సమస్యల సాధనకు ఆగస్టు 7న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో విద్యుత్తు సిబ్బంది పాల్గొనాలని కోరారు. యూనియన్ నేతలు రవీంద్రనాథ్, శివరాముడు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్మీకంపోస్టులో వానపాముల విడుదల

ముద్దనూరు జూలై25(ఆంధ్రజ్యోతి):స్థానిక డీఎన్‌పల్లె వద్ద నున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద వర్మీకంపోస్టు బెడ్లలో శుక్రవారం ఎంపీడీవో రాధాకృష్ణవేణి వానపాములను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నరసింహులు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



14వ వార్డులో ఇంటింటికి వెళ్లి మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని 14వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు అందించి స్థానికులతో మాట్లాడారు. వెళ్లిన ప్రతి ఇంటిలో సబ్సిడీ సిలిండర్ వచ్చిందని, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లి వందనం పడిందని మరికొందరు 1వ తేదీ పింఛన్ డబ్బులు ఇంటి వద్దకు తెచ్చి అందిస్తున్నారని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటిన్లు ప్రారంభించామని, రోడ్లు వేయడం, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి సౌకర్యాలు కల్పించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పరిశీలకుడు రామకృష్ణ, జిల్లా అధికార ప్రతినిది పొన్నతోట శ్రీనివాసులు, క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు, 14వ వార్డు టీడీపీ నాయకులు బీర్రు సంతోష్, జైపాల్, దువ్వూరి మురళి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రాకకోసం ముమ్మర ఏర్పాట్లు



కంపచెట్లు తొలగించే ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగుకు ఆగస్టు1న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రానున్నందను అందు కోసం అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ఖాళీ స్థలాల్లో శుక్రవారం ఉదయం నుంచి కంపచెట్లు తొలగించి శుభ్రం చేస్తున్నారు. కాగా అందులో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, స్థానిక అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్‌కు గొరిగెనూరు గ్రామానికి చెందిన బాధితులు జమ్మలమడుగు పట్టణం తాడిపత్రి రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం అధికంగా ఫీజులు వేసి డబ్బు చెల్లించకపోతే టీసీలు ఇవ్వమని చెప్పి ఇబ్బంది పెడుతోందని తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. వెంటనే కలెక్టర్ ఆర్డీవో సాయిశ్రీని విచారించి ఆ పేద కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. కాగా గత మూడు నెలల క్రితం ముద్దనూరు రోడ్డులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుటకు గుంతలు తీసి అలాగే వదలి వేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త విద్యుత్ సర్వీసు విడుదలలో జాప్యం తగదు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమణ

ముద్దనూరు జూలై25(ఆంధ్రజ్యోతి):వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ సమస్యల పై వెంటనే స్పందించడంతోపాటు కొత్త విద్యుత్ సర్వీసుల విడుదల్లో జాప్యం చేయవద్దని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ ఆదేశించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా విద్యుత్ శాఖ సూపరెంటెండెంట్ ఇంజనీరు రమణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా సబ్‌స్టేషన్, టౌన్‌లోని ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ తీగలను పరిశీలించారు. తరువాత నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త విద్యుద్ సర్వీసుల విడుదల్లో జాప్యం చేస్తే సమయాన్ని బట్టి వినియోగదారులకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం క్రింద గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు బ్యాంకు రుణాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ రాజగోపాల్, ఏఈ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పెళ్లైన మూడోరోజే ఆత్మహత్య చేసుకున్న వధువు

ప్రొద్దుటూరు , జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పెళ్లైన మూడోరోజున నవవధువు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రొద్దుటూరులో చోటుచేసుకుంది. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ భగత్‌సింగ్‌కాలనికి చెందిన మబూచాన్ (18)కు మూడు రోజుల క్రితం మైదుకూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వివాహం జరిగిన మరుసటిరోజు మబూచాన్ భగత్ సింగ్ కాలనీలోని తల్లిగారిఇంటికి వచ్చింది. ఇష్టం లేని వివాహంతో మనస్థాపం చెంది గురువారం భగత్‌సింగ్ కాలనీలోని తల్లిగారిఇంట్లో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా వరుడికి ఇది సెకండ్ మ్యారేజి. మాబూచాన్ కడుపు నొప్పి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు పిర్యాదు చేయడంతో పోలీసులు ఆదిశగా కేసు నమోదు చేశారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో హోంలో ఆదివారం ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకు మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి జె.రామసుబ్బయ్యలు తెలిపారు. ప్రొద్దుటూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీహెచ్‌ఎస్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.గుండె, షుగర్‌వ్యాధి, నరాలు, ఎముకలకు సంబంధించి సలహాలిస్తామన్నారు

పింఛన్లు పంపిణీ చేయడానికి రావడమా!

మైదుకూరు రూరల్, జులై 25(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడు ఫింఛన్లు పంపిణీ చేయడానికి రావడం ఏమిటంటూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఎద్దేవ చేశారు.స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మైదుకూరు మున్సిపాలిటీలో రూ.5 కోట్ల పనులు కూడా జరగలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ షరీఫ్,యంఆర్‌ఎఫ్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు మాని అభివృద్ధికి సహకరించండి

మైదుకూరు రూరల్, జులై 25(ఆంధ్రజ్యోతి) : విమర్శలు మాని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండంటూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ధనపాల జగన్‌లు హితవు పలికారు. టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అహర్నిశలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పాశం మారుతీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

ప్రొద్దుటూరు జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలో ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా ట్రాఫిక్ రూల్స్ ను అధిగమించి వాహనాలు నడుతున్నారని పద్ధతి మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తామని ఇన్‌చార్జ్ ట్రాఫిక్ సీఐ గోవిందరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫాంను తప్పని సరిగా వేసుకోవాలన్నారు. పీసీ నెంబరు లేకుండా ఆటో తిరిగితే సీజ్ చేస్తామన్నారు. మద్యం తాగి ఆటో నడిపితే కేసులు పెడతామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడానికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి పేర్కొన్నారు. శుక్రవారం పద్మశాలీయ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని జడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు ఎక్కువగా ఉంటారని, వారి విద్యాభివృద్ధి కోసం పద్మశాలీయ అభ్యుదయ సంఘం స్టడీ మెటీరియల్ అందజేసిందన్నారు. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి చాలా ముందుగానే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో 13 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, 27 సంవత్సరాలుగా 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని 30 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1760 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.5.25 లక్షలతో స్టడీ మెటీరియల్ దాతల సహకారంతో అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సాధు అశోక్, చెన్నా వెంకటచంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, కోశాధికారి శ్రీనివాసులు, జింకా సుబ్రమణ్యం, కడప రామిశెట్టి, నందం రామయ్య, పోలంకి వరదరాజులు, సురేష్‌బాబు, జింకా రమేష్, జానకీరామయ్య, ఉమానరసింహులు పాల్గొన్నారు.